సాక్షి ఖమ్మం

సోమవారం । 11 । సెప్టెంబర్ । 2023



రైతులకు సౌకర్యాల కల్పన

ఆయిల్‌పామ్ సాగు చేసే రైతులకు సౌకర్యాల కల్పనపై దృష్టి సారించినట్లు ఆయిల్‌ఫెడ్ చైర్మన్ రామకృష్ణారెడ్డి తెలిపారు. 8లో



సామర్థ్యాల సాధన.. పెంపు

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో సామర్థ్యాలు పెంచి ఫలితాలు మెరుగుపర్చేలా ఉన్నతి, లక్ష్య కార్యక్రమాల అమలుకు సిద్ధమయ్యారు. 8లో

గరిష్టం / కనిష్టం 32° / 26°

వాతావరణం

జిల్లాలో సోమవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. కొన్ని ప్రాంతాల్లో చిరుజల్లుల నుంచి ఓ మోస్తరు వర్షం కురవొచ్చు.

న్యూస్‌రీల్

సీఎం కేసీఆర్‌కు అండగా నిలుద్దాం...

- రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు



మనుమరాలికి అక్షరాభ్యాసం చేయిస్తున్న ఎంపీ రవిచంద్ర

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్రంలోని అన్ని వర్గాల అభివృద్ధి, సంక్షేమానికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్‌కు వచ్చే ఎన్నికల్లో సంపూర్ణ మద్దతు ఇవ్వాలని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర మున్నూరుకాపులకు పిలుపునిచ్చారు. నిర్మల్ జిల్లా బాసర మండల కేంద్రంలోని జ్ఞాన సరస్వతీ అమ్మవారిని ఎంపీ ఆదివారం కుటుంబ సమేతంగా దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం తన మనువరాలు సహశ్రీతో అక్షరాభ్యాసం చేయించారు. ఆతర్వాత ఆయన ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డితో కలిసి మున్నూరు కాపులతో సమావేశమై మాట్లాడారు. మున్నూరు కాపులు మరింత ఐకమత్యంతో ముందుకు సాగుతూ కేసీఆర్‌కు అండగా నిలవాలని కోరారు.

ప్యాసింజర్ రైళ్ల రద్దు పొడిగింపు



ఖమ్మం మామిళ్లగూడెం: ట్రాక్ మరమ్మతుల కారణంగా దక్షిణ మధ్య రైల్వే పలు ప్యాసింజర్ రైళ్లను రద్దు చేసింది. అయితే, ఈనెల 10నుంచి రైళ్లను పునరుద్ధరించనున్నట్లు ప్రకటించినా, పనులు పూర్తికాకపోవడంతో 17తేదీ వరకు రైళ్లను రద్దు చేస్తున్నట్లు ఖమ్మం సీసీఐ జాఫర్ తెలిపారు. విజయవాడ నుండి ఖమ్మం మీదుగా నడిచే డోర్నకల్ – విజయవాడ(07755), విజయవాడ – డోర్నకల్(07756), భద్రాచలం రోడ్ – విజయవాడ(07278), విజయవాడ – భద్రాచలం రోడ్(07279) ప్యాసింజర్ రైళ్ల నడవవనే విషయాన్ని గుర్తించి ప్రయాణికులు సహకరించాలని ఆయన ఓ ప్రకటనలో కోరారు.

ఖమ్మం స్టేషన్‌లో అభివృద్ధి పనులు

అమృత్ భారత్‌లో ఎంపికైన ఖమ్మం రైల్వేస్టేషన్‌లో అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయని సీసీఐ జాఫర్ తెలిపారు. ఈమేరకు రెండు వెయిటింగ్ హాళ్లను మూసివేయగా, ఒకటి, రెండో నంబర్ ప్లాట్‌ఫాంలపై కోచ్ ఇండికేషన్ బోర్డులు కూడా పనిచేయవని వెల్లడించారు.

పొంగులేటికి మువ్వా కృతజ్ఞతలు



శ్రీనివాసరెడ్డికి కృతజ్ఞతలు చెబుతున్న విజయ్‌బాబు

ఖమ్మంమయూరిసెంటర్: కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో కమిటీలో సభ్యుడిగా నియమించేందుకు సహకరించిన కాంగ్రెస్ ప్రచార కమిటీ కోచైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డికి మువ్వా విజయబాబు కృతజ్ఞతలు తెలిపారు. ఈమేరకు ఆదివారం పొంగులేటిని క్యాంపు కార్యాలయంలో కలిసి మొక్క అందజేశారు. తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వర్తిస్తానని పేర్కొన్నారు.



4.40 కోట్ల నిధులు

జిల్లాలో ఈ ఏడాది చేపపిల్లలకు ప్రభుత్వం రూ.4,40,10,953 నిధులు కేటాయించింది. చిన్న చేపపిల్లకు రూ.0.58 పైసల చొప్పున, పెద్ద చేప పిల్లకు రూ.1.58గా ధర నిర్ణయించారు. చిన్న చేప పిల్లల్లో కట్ల, రోహు, బంగారుతీగ రకాలు ఉన్నాయి. జిల్లాలోని నాలుగు రిజర్వాయర్లు, 125 పెద్ద చెరువులతో పాటు మిగిలి చిన్న చెరువుల్లో చేప పిల్లలు వదిలేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు.

లెక్కాపత్రం లేదు..!

చేపపిల్లల పంపిణీలో కాంట్రాక్టర్ల మాయాజాలం

- ఏటా ఇదే తరహాలో అక్రమాలు
- తాజాగా కలెక్టర్ సమక్షంలో బయటపడిన బాగోతం
- రూ.కోట్ల విలువైన చేపపిల్లల పథకంలో అవినీతి



కోటపాడు చెరువు వద్ద చేపపిల్లల లెక్క వేయిస్తున్న కలెక్టర్ గౌతమ్ (ఫైల్)

ఖమ్మంవ్యవసాయం: చేప పిల్లల పంపిణీలో కాంట్రాక్టర్లు వ్యవహరిస్తున్న తీరుతో ప్రభుత్వానికి నష్టం జరుగుతుండగా... మత్స్యకారులకు లబ్ధి చేకూరడం లేదు. జలాశయాలకు కేటాయించిన సంఖ్య కంటే తక్కువగా చేప పిల్లలను సరఫరా చేస్తున్న కాంట్రాక్టర్లు అక్రమాలకు పాల్పడుతున్నారు. వేలు, లక్షల్లో వదిలే చేపపిల్లలను ఎవరు లెక్క పెడతారులే అన్న ధీమాతో వారు ఏటా ఇలాగే దోపిడీకి తెర తీస్తున్నారు. అయితే, కలెక్టర్ గౌతమ్ ఇటీవల రఘునాథపాలెం మండలం కోటపాడు చెరువులో వదలాల్సిన చేపపిల్లలను ఉద్యోగులతో లెక్కించడంతో బాగోతం బయటపడింది. ఈ చెరువుకు 75 వేల చేప పిల్లలను కేటాయిస్తే 21,500 పిల్లలను తక్కువగా తీసుకొచ్చినట్లు గుర్తించారు. గత ఏడాది ఇలాగే కలెక్టర్ పరిశీలనలో అక్రమాలు బయటపడగా ఈసారి కూడా మత్స్యశాఖ అధికారుల పర్యవేక్షణ లోపంతో కాంట్రాక్టర్లు మళ్లీ అదే తరహా మోసానికి సిద్ధమయ్యారు.

జిల్లాలో 3.62 కోట్ల చేపపిల్లలకు టెండర్లు

మత్స్యకారుల ఆర్థికాభివృద్ధి కోసం 2015 నుంచి రాష్ట్రప్రభుత్వం వంద శాతం సబ్సిడీపై జలాశయాల్లో చేపపిల్లలను పంపిణీ చేస్తోంది. జలాశయాల విస్తీర్ణం, నీటి వనరుల ఆధారంగా 35–40 మి.మీ.లు, 80–100 మి.మీ.ల సైజ్ చేప పిల్లల పంపిణీకి టెండర్లు ఆహ్వానించారు. జిల్లాలో 903 చెరువులను ఎంపిక చేయగా అన్ని జలాశయాల్లో కలిపి రెండు సైజ్‌ల్లో 3.62 కోట్ల చేప పిల్లలను వదలాలని నిర్ణయించారు. ఈ టెండర్లను నేలకొండపల్లి మండలం నాచేపల్లి, కల్లూరు మండలం లోకారం, బోనకల్ మండలం కలకోటకు చెందిన సీడ్ ఫామ్స్ నిర్వాహకులు దక్కించుకున్నారు.

ప్రభుత్వ లక్ష్యానికి తూట్లు

చేప పిల్లలను కిలోల చొప్పున తూకం వేసి కాంట్రాక్టర్లు చెరువుల్లో వదలాల్సి ఉంటుంది. కట్ల రకం కిలో ఒక్కంటికి 210 పిల్లలు వస్తుండగా, రోహు 290 పిల్లలు, మృగాల రకమైతే 260 పిల్లలు వస్తాయి. సీడ్ ఫామ్ నుంచి పిల్లలను డ్రమ్ముల్లో తీసుకొచ్చే క్రమంలోనే అక్రమాలకు తెరతీస్తున్నారు. లెక్క ప్రకారమే చేపపిల్లలు తీసుకొచ్చామని నమ్మబలికి హడావుడిగా కాంట్రాక్టర్ల మనుషులు చెరువుల్లో పోసి వెళ్తున్నారు. అయితే, సరఫరా సమయంలో చనిపోయిన పిల్లలకు బదులు అంతే సంఖ్యలో కాంట్రాక్టర్ చెరువుల్లో పోయాల్సి ఉంటుంది. కానీ ఎక్కడ కూడా అలా పోసిన దాఖలాలు లేకపోగా, చేపపిల్లలను వీడియో చిత్రీకరిస్తూ లెక్కించాకే పోయాలనే నిబంధనను అటు అధికారులు, ఇటు కాంట్రాక్టర్లు గాలికొదిలేశారు.

గత ఏడాది అసంపూర్ణమే...

టెండర్లు ఆలస్యం కావడంతో గత ఏడాది చేప పిల్లల పంపిణీ సంపూర్ణంగా జరగలేదు. జిల్లాలో మొత్తం 900కు పైగా చెరువులకు గాను కేవలం 583 చెరువుల్లో రెండు కోట్ల చేపపిల్లలే వదిలారు. వీటికి సంబంధించి కాంట్రాక్టర్లకు ఇంకా రూ.1.50 కోట్ల బిల్లులు చెల్లించాల్సి ఉంది. అయితే, ఓ కాంట్రాక్టర్ గ్యారంటీకి చెల్లించిన రూ.20 లక్షలు సైతం పెండింగ్‌లోనే ఉన్నాయి. ఏదిఏమైనా మత్స్యకారుల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం ఉచిత చేపపిల్లల పంపిణీని చేపట్టగా, అదే మత్స్యకారుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని కాంట్రాక్టర్లు చేతివాటం ప్రదర్శిస్తున్నట్లు బయటపడిన నేపథ్యాన అధికారులు ఇకనైనా ప్రత్యేక దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

పిల్లలు తగ్గితే మళ్లీ పోయిస్తాం



చెరువుల్లో చేప పిల్లలను వదిలే సమయాన లెక్కించడంతో పాటు తక్కువగా ఉంటే మళ్లీ పోయిస్తాం. చేప పిల్లలను కాంటా వేసి కేజీకి ఎన్ని ఉన్నాయో చూసి మొత్తం పిల్లల సంఖ్యను నిర్ధారిస్తున్నాం. పలు సందర్భాల్లో చెరువుల వద్దకు తీసుకొచ్చే సమయాన కొన్ని చేపపిల్లలు చనిపోతాయి. ఇలాంటి వాటి స్థానంలో మళ్లీ చేప పిల్లలను తెప్పించి పోయిస్తాం. ఎలాంటి అక్రమాలు జరగకుండా పర్యవేక్షిస్తున్నాం.

– డి ఆంజనేయస్వామి, జిల్లా మత్స్యశాఖ అధికారి

ఎవరూ ఇబ్బంది పడొద్దనేదే తపన



వరద బాధితులకు చెక్కు అందజేస్తున్న మంత్రి పువ్వాడ, పక్కన కలెక్టర్ గౌతమ్, మేయర్ నీరజ తదితరులు

- మున్నేటి కష్టాలకు ఆర్‌సీసీ వాల్‌తో చెక్
- బాధితులకు ఆర్థికసాయం అందజేసిన మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

ఖమ్మంమయూరిసెంటర్: మున్నేరుకు వరద వచ్చినప్పుడు ఎవరూ ఇబ్బంది పడొద్దనే తపనతో అండగా నిలబడ్డానని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ వెల్లడించారు. వరద బాధితులు 1,718 మందికి రూ.1.45 కోట్ల విలువైన ఆర్థిక సాయం చెక్కును జిల్లా కేంద్రంలోని నయాబజార్ పాఠశాల ఆవరణలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన అందజేసి మాట్లాడారు. ఐటీసీ సహకారంతో ఇప్పటికే రూ.కోటితో గృహోపకరణాలు అందజేశామని తెలిపారు. అలాగే, ఎంపీ బండి పార్థసారథిరెడ్డి రూ.కోటి, తన కోడలు అపర్ణ ఆమె తాతయ్య కంపెనీ నుండి సమకూర్చిన డబ్బు కలిపి రూ.1.45 కోట్లను కలెక్టర్ అకౌంట్‌కు బదలాయించి పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ఇందులో ఒక్కో కుటుంబానికి రూ.8వేలకు పైగా అందుతాయని తెలిపారు. కాగా, భవిష్యత్‌లో మున్నేటికి వరద వచ్చినా ఇబ్బంది ఎదురుకాకుండా తన వినతితో ఆర్‌సీసీ రక్షణ గోడ నిర్మాణానికి సీఎం కేసీఆర్ రూ.690 కోట్లు మంజూరు చేశారని వివరించారు. ఇందుకు ప్రతిపాదనలు సిద్ధమవుతున్నాయని తెలిపారు. ఖమ్మంను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్న బీఆర్‌ఎస్ పార్టీని మరోమారు గెలిపించాలని, దండాలు పెడుతూ వచ్చేవారిని తిప్పికొట్టాలని పువ్వాడ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ, కలెక్టర్ వీ.పీ. గౌతమ్, డీసీసీబీ, సుడా చైర్మన్లు కూరాకుల నాగభూషణం, విజయ్‌కుమార్, ఆర్డీఓ గణేష్, తహసీల్దార్ స్వామి, కార్పొరేటర్లు కమర్తపు మురళి, మాటేటి లక్ష్మీనాగేశ్వరరావు, కన్నం వైష్ణవిప్రసన్న కృష్ణ, నాయకులు గుండాల కృష్ణ, పగడాల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నాం

ఖమ్మం సహకారనగర్: ఉపాధ్యాయుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం ఒక్కటొక్కటిగా పరిష్కరిస్తోందని మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ వెల్లడించారు.



పీఆర్‌టీయూ కార్యాలయాన్ని ప్రారంభించిన మంత్రి పువ్వాడ

ఖమ్మంలో నిర్మించిన పీఆర్‌టీయూ జిల్లా కార్యాలయాన్ని మంత్రి ప్రారంభించారు. అనంతరం పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షులు మోతుకూరి మధు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల షెడ్యూల్‌కు ముందే ముఖ్యమంత్రి మధ్యంతర భృతి ప్రకటించడం ద్వారా తీపి కబురు చెబుతారని చెప్పారు. సమర్థ నాయకత్వంతో జిల్లాలో అగ్రగామిగా ఉన్న పీఆర్‌టీయూ నూతన కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ.25 లక్షల నిధులను కేటాయిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, ఎమ్మెల్సీ తాతా మధు, విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు, డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, మేయర్ పునుకొల్లు నీరజ, మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్, పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పింగళి శ్రీపాల్‌రెడ్డి, బీరెల్లి కమలాకర్‌రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.రంగారావు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.వెంకటేశ్వరరావు, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా వనరులను సద్వినియోగం చేసుకోండి

ఖమ్మం స్పోర్ట్స్: జిల్లా కేంద్రంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో సమకూరిన క్రీడా వనరులను ప్రతీ క్రీడాకారుడు సద్వినియోగం చేసుకుని జిల్లాకు ఖ్యాతి తీసుకురావాలని రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సూచించారు. స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి మహిళల ఖేలో ఇండియా వెయిట్ లిఫ్టింగ్ పోటీలను మంత్రి ప్రారంభించి మాట్లాడారు. డీవైఎస్‌ఓ టి.సునీల్‌రెడ్డి, వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ జిల్లా చైర్మన్ పగడాల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణలో ముందు నిలవాలి

- సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ
- ఖమ్మంలో జనసేవాదళ్ శిక్షణ ప్రారంభం



సమావేశంలో మాట్లాడుతున్న నారాయణ, పక్కన నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: ప్రజాస్వామ్య పరిరక్షణకు పాటుపడుతూనే మతోన్మాద శక్తులను నిలువరించడంలో జన సేవాదళ్ కార్యకర్తలు ముందువరుసలో నిలవాలని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ సూచించారు. సామాన్యుల ఆస్తుల పరిరక్షణ, మతోన్మాద శక్తులను ఎదుర్కొనేందుకు చండ్ర రాజేశ్వరరావు జన సేవాదళ్‌ను ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. ఖమ్మంలో జనసేవాదళ్ శిక్షణను ఆదివారం ఆయన ప్రారంభించారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన జన సేవాదళ్ కార్యకర్తలతో కలిసి పరేడ్ నిర్వహించాక పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆర్‌ఎస్‌ఎస్, అనుబంధ సంస్థలు ప్రజల మధ్య చిచ్చు రేపుతున్న ఈ సమయంలో జన సేవాదళ్ కార్యక్రమాలను మరింత విస్తరించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. కులం, మతం ప్రాతిపదికన బీజేపీ వ్యవహరిస్తున్న తీరును ఎండగట్టాలని పిలుపునిచ్చారు. భూపోరాటాలలో ప్రజలకు అండగా నిలుస్తూనే ప్రజా ఆందోళనలు, ఉద్యమాలకు అండగా నిలవాలని తెలిపారు. కాగా, సీపీఐ ఆవిర్భవించి వందేళ్లు పూర్తవుతున్న సందర్భంగా 2024లో ఢిల్లీలో లక్ష మందితో కవాతు నిర్వహించాలనే లక్ష్యంతో ఖమ్మంలో శిక్షణ ప్రారంభించినట్లు చెప్పారు. ఇక్కడ శిక్షణ పొందిన వారు రాష్ట, జిల్లా, మండల స్థాయిలో తర్ఫీదు ఇవ్వాల్సి ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, నాయకులు దండి సురేష్, మహ్మద్ మౌలానా, జమ్ముల జితేందర్‌రెడ్డి, యర్రా బాబు, ఎస్.కే.జానీ మియా, కొండపర్తి గోవిందరావు, సిద్ధినేని కర్ణకుమార్, ఇటికాల రామకృష్ణ, వానబాల రామకృష్ణ, తాటి నిర్మల, పగిడిపల్లి ఏసు, గాదె లక్ష్మీనారాయణ, బోడా వీరన్న తదితరులు పాల్గొన్నారు.

12న ఏఈ అభ్యర్థుల సర్టిఫికెట్లు పరిశీలన

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో అసిస్టెంట్ ఇంజనీర్(ఈ అండ్ ఎం) గ్రేడ్–2 ఇంటర్నల్ అభ్యర్థులకు సంబంధించి సర్టిఫికెట్లను ఈనెల 12న పరిశీలించనున్నట్లు సంస్థ రిక్రూట్‌మెంట్ సెల్ జీఎం కట్టా బసవయ్య తెలిపారు. సంస్థలో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ ఇంజనీర్ 24 పోస్టులకు ఆగస్టు 6న రాతపరీక్ష నిర్వహించినట్లు పేర్కొన్నారు. పరీక్షకు 573 మంది హాజరుకాగా, 441 మంది క్వాలిఫై అయ్యారని తెలిపారు. అయితే, కొందరు మహిళా అభ్యర్థులు ప్రత్యేక కోటా కేటాయించాలని కోర్టును ఆశ్రయించగా, ఎనిమిది పోస్టులు మినహా మిగిలిన 16 పోస్టులకు సంబంధించి ప్రక్రియ చేపట్టవచ్చని ఆదేశించిందని చెప్పారు. దీంతో ఈనెల 12న అభ్యర్థుల సర్టిఫికెట్లు పరిశీలించి, వైద్యపరీక్షల అనంతరం నియామకాలు చేపడుతామని జీఎం తెలిపారు. ఇప్పటికే అభ్యర్థులు సెల్ ఫోన్లకు మెసేజ్ పంపినందున కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయంలో సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరు కావాలని సూచించారు.

నేటితో ముగియనున్న శ్రీమద్భాగవత హవనం

రామయ్యకు వైభవంగా సువర్ణపుష్పార్చన

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో కొనసాగుతున్న శ్రీమద్భాగవత సప్తాహ హవనం సోమవారంతో ముగియనుంది. శ్రీ కృష్ణాష్టమి సందర్భంగా చిత్రకూట మండపంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో హోమం, భాగవత పారాయణ హవనం నిర్వహిస్తుండగా ఆదివారం నాటి పూజల్లో ఆలయ ఈఓ రమాదేవి పాల్గొన్నారు. సోమవారం సాయంత్రం ముగింపు వేడుకల సందర్భంగా సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు చిత్రకూట మండపంలో శ్రీ రుక్మిణి సత్యభామా సమేత వేణుగోపాలస్వామి వారి కల్యాణోత్సవం ఉంటుందని ఈఓ తెలిపారు.

స్వామివారికి సువర్ణపుష్పార్చన

అంతరాలయంలోని మూలమూర్తులకు ఆదివారం అభిషేకం, సువర్ణ పుష్పార్చన చేశారు. తెల్లవారుజామున గర్భగుడిలో సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం స్వామివారిని పల్లకీ సేవగా బేడా మండపానికి తీసుకొచ్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం జరిపించారు. స్వామివారికి కంకణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.



హోమం నిర్వహిస్తున్న అర్చకులు, హాజరైన ఈఓ రమాదేవి

'గుర్తింపు' ఎన్నికలపై నేడు సమావేశం

- ఎన్నికల నిర్వహణకు సింగరేణి విముఖత
- రెండేళ్లుగా కొనసాగుతున్న వాయిదాల పర్వం
- మరోసారి ప్రక్రియ ప్రారంభించిన కార్మిక శాఖ

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: సింగరేణిలో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల నిర్వహణ అంశం ఒక అడుగు ముందుకు.. రెండడుగులు వెనక్కు అన్నట్టుగా మారింది. ఇప్పటికే మూడుసార్లు ఎన్నికల నిర్వహణ వాయిదా పడింది. తాజాగా నాలుగో ప్రయత్నంగా ఇదే అంశంపై కార్మిక సంఘాలతో సమావేశం నిర్వహించేందుకు కేంద్ర కార్మిక శాఖ సిద్ధమైంది. ఈ మేరకు కార్మిక సంఘాలు, సింగరేణి అధికారులతో కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ నేతృత్వంలో సోమవారం హైదరాబాద్‌లో సమావేశం జరుగనుంది. ఇందులో ఎన్నికలు ఎప్పుడు నిర్వహించాలి, ఓటర్ల జాబితా ఎప్పుడు ప్రకటించాలి తదితర అంశాలపై చర్చించనున్నారు.

రెండేళ్లుగా వాయిదా

సింగరేణిలో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు తొలిసారిగా 1998లో జరగగా, చివరిసారి 2017 అక్టోబర్‌లో నిర్వహించారు. ఆ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అనుబంధ తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం గెలుపొందింది. ఈ సంఘం గుర్తింపు కాలపరిమితి 2021తో ముగిసింది. ఆతర్వాత వివిధ కారణాలతో యాజమాన్యం వాయిదా వేస్తూ వస్తోంది. ఈ అంశంపై సీపీఐ అనుబంధ సింగరేణి కోల్‌మైన్స్ యూనియన్ (ఏఐటీయూసీ) హైకోర్టును ఆశ్రయించింది. అక్కడ కార్మిక సంఘాలకే అనుకూలంగా తీర్పు వచ్చినా సాంకేతిక కారణాలను సాకుగా చూపుతూ సింగరేణి సంస్థ ఎన్నికలు వాయిదా వేస్తోంది. బీఆర్‌ఎస్ సర్కార్ ఆదేశాల మేరకే ఎన్నికల నిర్వహణలో వెనుకంజ వేస్తోందనే విమర్శలు సంస్థపై ఉన్నాయి.

కారు జోరుకు బ్రేకులు..

ఉత్తర తెలంగాణలోని ఆరు జిల్లాల పరిధిలో సింగరేణి బొగ్గు గనులు, విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు ఉన్నాయి. ఈ సంస్థలో 42 వేల మందికి పైగా కార్మికులు పని చేస్తున్నారు. 12 అసెంబ్లీ నియోజకవర్గాల్లో సింగరేణికి సంబంధించిన అంశాలు గెలుపోటములను ప్రభావితం చేసే పరిస్థితులు నెలకొన్నాయి. తెలంగాణ ఏర్పాటైన తర్వాత 2014, 2018లో రెండుసార్లు జరిగిన సాధారణ ఎన్నికల్లో మిగిలిన ప్రాంతాల్లో కారు పార్టీ జోరు చూపించింది. కానీ కోల్‌బెల్ట్ ఏరియాల్లో మాత్రం ఆ పార్టీకి భంగపాటు ఎదురైంది. దీంతో గత రెండేళ్లగా గుర్తింపు సంఘం ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం సుముఖంగా లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

వస్తే రానీ.. పోతే పోనీ..

సింగరేణి ఎన్నికల నిర్వహణ విషయంలో బీఆర్‌ఎస్ పార్టీ వైఖరిలో ఇటీవల మార్పు వచ్చిందంటున్నారు. ఇప్పటికే కమ్యూనిస్టులతో తెగదెంపులు చేసుకున్న బీఆర్‌ఎస్.. తొలి జాబితా ప్రకటన తర్వాత అసమ్మతి నేతలు పార్టీని వీడి వెళ్తున్నా డోంట్ కేర్ అన్నట్లుగా వ్యవహరిస్తోంది. ఇప్పుడు గుర్తింపు కార్మిక సంఘం ఎన్నిక విషయంలోనూ ఏది జరిగినా సరే అనే భావన పార్టీలో నెలకొందని బీఆర్‌ఎస్ వర్గాలు అంటున్నాయి. ఎన్నికల సాధ్యాసాధ్యాలను కేంద్ర కార్మిక శాఖ చూసుకుంటుందని, అక్కడి నుంచి వచ్చే ఆదేశాలకు తగ్గట్టుగా ముందుకు పోవడమే మంచిదనేది గులాబీ నేతల అభిప్రాయంగా చెబుతున్నారు.

క్లుప్తంగా

బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ పారదర్శకంగా చేపట్టాలి


డీఈఓకు వినతిపత్రం అందజేస్తున్న టీపీటీఎఫ్ నాయకులు

ఖమ్మం సహకారనగర్: జిల్లాలో ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.విజయ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆదివారం డీఈఓ సోమశేఖరశర్మకు వినతిపత్రం సమర్పించారు. అనంతరం విజయ్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమర్పించిన అప్పీళ్లను పరిగణనలోకి తీసుకోవాలని, మెడికల్ సర్టిఫికెట్లు, స్పౌజ్, ఇతర కేటగిరీల్లో అవకతవకలు జరగకుండా చూడాలన్నారు. అలాగే, ఖాళీగా ఉన్న అన్ని ఉపాధ్యాయ పోస్టులను వెల్లడించాలని ఆయన కోరారు. ఈకార్యక్రమంలో నాయకులు ప్రసాద్‌రావు, నాగేశ్వరరావు తదితరులు ల్గొన్నారు.

బీజేపీ టికెట్‌కు పొంగులేటి అనుచరుడి దరఖాస్తు

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి బీజేపీ టికెట్ కోసం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి అనుచరుడు, కార్పొరేటర్ అనుచరుడు దొడ్డా నగేష్ దరఖాస్తు చేశారు. ఆయన తరఫున కొందరు ఆదివారం దరఖాస్తు అందజేయగా, నగేష్ ఖమ్మంలో మాట్లాడారు. ఖమ్మం నుంచి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పోటీ చేస్తే ఆయన మద్దతు ఇస్తానని, లేనిపక్షంలో తాను బీజేపీ తరఫున లేదంటే స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తానని తెలిపారు. కాగా, కేఎంసీ 27వ డివిజన్ నుంచి స్వతంత్ర అభ్యర్థిగా కార్పొరేటర్‌గా గెలిచిన నగేష్ పొంగులేటి వెంట కొనసాగుతున్నారు.

ఎన్నెస్పీ కాల్వకు గండి

వరద ఉధృతికి కొట్టుకుపోయిన వరినాట్లు


వరి పొలంలోకి చేరుతున్న వరద

కల్లూరు రూరల్: ఎన్నెస్పీ మధిర బ్రాంచ్ కెనాల్ ఆయకట్టులో వరి పొలాలు ఎండిపోతున్నాయన్న రైతుల వినతితో సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పాలేరు రిజర్వాయర్ నుంచి ఎన్నెస్పీ మిగులు జలాలను విడుదల చేయించారు. అయితే, కెనాల్‌కు అనుసంధానంగా ఉన్న కల్లూరు మండలంలోని మునుకుళ్ల మేజర్ కాల్వకు ఆదివారం గుర్తుతెలియని వ్యక్తులు గండి పెట్టారు. దీంతో కాల్వ నీరు వృథా కావడమే కాక వరినార్లు, పొలాలను ముంచెత్తిందని రైతులు ఆందోళన చెందుతున్నారు. అంతేకాక చంద్రుపట్ల, రఘునాథగూడెం, మురుకుళ్ల గ్రామాలకు చెందిన సాగునీటి సరఫరా నిలిచిపోయింది. ఈ విషయమై ఎన్నెస్పీ అధికారులకు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పాటు గండి పూడ్చే పనులు చేయిస్తున్నారు.

కిన్నెరసానిలో పర్యాటకుల సందడి


బోట్ షికారు చేస్తున్న పర్యాటకులు

పాల్వంచరూరల్ : జిల్లా నలుమూలలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి భారీగా తరలివచ్చిన పర్యాటకులు ఆదివారం కిన్నెరసానిలో సందడి చేశారు. డ్యామ్ పైనుంచి జలాశయాన్ని, డీర్‌పార్కులో దుప్పులను వీక్షించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆనందోత్సాహాల మధ్య గడిపారు. 652 మంది పర్యాటకులు కిన్నెరసానిలోకి ప్రవేశించడం ద్వారా వైల్డ్‌లైఫ్ శాఖకు రూ.18,465, 210 మంది బోటు షికారు చేయడం ద్వారా టూరిజం కార్పొరేషన్ సంస్థకు రూ.10,880 ఆదాయం లభించినట్లు నిర్వాహకులు తెలిపారు.

గిరిజన సంక్షేమ సంఘం కోఆర్డినేటర్‌గా సురేశ్



సురేశ్‌ను అభినందిస్తున్న శంకర్‌నాయక్

తిరుమలాయపాలెం: తెలంగాణ గిరిజన సంక్షేమ సంఘం ఉమ్మడి ఖమ్మం జిల్లా కోఆర్డినేటర్‌గా మండలంలోని గుగులోత్ సురేశ్‌నాయక్ నియమితులయ్యారు. మండలంలోని బచ్చోడుతండాకు చెందిన ఆయనకు ఆదివారం సంఘం అధ్యక్షుడు గుగులోత్ శంకర్‌నాయక్ ఉత్తర్వులు అందజేశారు.

సామర్థ్యాల సాధన.. ఫలితాల పెంపు

ఇదే లక్ష్యాలతో ఉన్నతి, లక్ష్య అమలుకు సిద్ధం

- ఉపాధ్యాయులకు కొనసాగుతున్న శిక్షణ
- హాజరవుతున్న సబ్జెక్టుల టీచర్లతో పాటు ప్రధానోపాధ్యాయులు


శిక్షణలో పాల్గొన్న ఉపాధ్యాయులు

ఖమ్మం సహకారనగర్: ప్రభుత్వ, ప్రభుత్వ అనుబంధ పాఠశాలల్లోని విద్యార్థుల్లో సామర్థ్యాలు పెంచడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. కరోనా సమయంలో ప్రత్యక్ష బోధన లేక వెనుకబడిన విద్యార్థులను తీర్చిదిద్దడమే కాక పాఠశాల స్థాయి నుంచే సామర్థ్యాలు పెంపొదించాలనే లక్ష్యంగా కృషి చేస్తోంది. గతంలో ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు అమలుచేసిన తొలిమెట్టు ద్వారా సత్ఫలితాలు వచ్చాయి. దీంతో ఉన్నత పాఠశాలల విద్యార్థులను తీర్చిదిద్దేలా 'ఉన్నతి' పేరిట ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారు. ఈమేరకు 6నుండి 9వ తరగతుల విద్యార్థులకు 'ఉన్నతి', పదో తరగతిలో ఫలితాలు మెరుగుపడేలా 'లక్ష్య' కార్యక్రమాలను రూపొందించారు. ఈ కార్యక్రమాల అమలు కోసం ప్రస్తుతం జిల్లాలోని ఉపాధ్యాయులకు విడతల వారీగా శిక్షణ ఇస్తున్నారు.

రెండు డివిజన్లు, మూడేసి రోజులు

ఉన్నతి, లక్ష్య కార్యక్రమాల అమలుకు ఉపాధ్యాయుల శిక్షణ కోసం జిల్లాను రెండు డివిజన్లుగా విభజించారు. ఈమేరకు ఖమ్మం, మధిర డివిజన్లుగా ఏర్పాటుచేసిన ఎనిమిది కేంద్రాల్లో 6 నుండి 10 తరగతులు బోధించే 2,132 మంది సబ్జెక్ట్ ఉపాధ్యాయులతో పాటు 229మంది ప్రధానోపాధ్యాయులకు మూడేసి రోజుల చొప్పున విడతల వారీగా శిక్షణ ఇస్తున్నారు. ఖమ్మం డివిజన్‌లోని శాంతినగర్ ప్రభుత్వ పాఠశాల, ఖమ్మంలోని మాంట్‌ఫోర్ట్ పాఠశాల, బల్లేపల్లిలోని ఎస్‌ఎఫ్‌ఎస్, రిక్కాబజార్ ప్రభుత్వ పాఠశాలల్లోనే కాక మధిర డివిజన్‌లోని వైరా ప్రభుత్వ పాఠశాల, తల్లాడలోని డాన్‌బాస్కో స్కూల్‌తో పాటు తనికెళ్లలోని గ్రేస్ పాఠశాలలో శిక్షణ కోసం రెండు కేంద్రాలు ఏర్పాటుచేశారు. కాగా, మొదటి విడత శిక్షణ ఆగస్టు 29నుంచి సెప్టెంబర్ 1వరకు ముగియగా 714 మంది ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఇక ఈనెల 2నుంచి 6వ తేదీ వరకు జరిగిన రెండో విడత శిక్షణలో 337 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు. మూడో విడత శిక్షణ సోమవారం ప్రారంభం కానుండగా 13వ తేదీ వరకు, నాలుగు విడత శిక్షణ ఈనెల 14నుంచి 16వ తేదీ వరకు నిర్వహించనున్నారు.


పంపిణీ చేయనున్న 'ఉన్నతి' అభ్యసన పుస్తకాలు

కరదీపికలు

శిక్షణలో భాగంగా ఉపాధ్యాయులకు ఉన్నతి, లక్ష్య కార్యక్రమాల ఆవశ్యకత, లక్ష్యాలు, విధివిధానాలు, బోధన ప్రణాళికలు, బోధనోపకరణాల వినియోగంపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కరదీపికలు అందజేశారు. ఈ కార్యక్రమ అమలు సమయాన ప్రతీ తరగతి గదిని పర్యవేక్షణాధికారులు పరిశీలించాల్సి ఉంటుంది. అలాగే, విద్యార్థుల ప్రగతిని నెలవారీ పరీక్షల ద్వారా మదింపు చేస్తూ బోధనను మెరుగుపర్చేలా సూచనలు చేస్తున్నారు. ఏది ఏమైనా ఈ విద్యాసంవత్సరంలో విద్యార్థులందరూ కనీస సామర్థ్యాలు సాధించడంతో పాటు పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించటమే లక్ష్యంగా ఉన్నతి, లక్ష్య కార్యక్రమాల అమలు జరగనుంది.

పకడ్బందీగా అమలు చేస్తాం


జిల్లాలో ఉన్నతి, లక్ష్య కార్యక్రమాలను పకడ్బందీగా అమలు చేసేలా కార్యాచరణ రూపొందించాం. ఇప్పటికే టీచర్లు, హెచ్‌ఎంలకు శిక్షణ ఇస్తుండగా, వీరు అమలుచేసే బోధన విధానాలతో విద్యార్థుల్లో సామర్థ్యాలు పెరగనున్నాయి.

– ఈ.సోమశేఖరశర్మ, జిల్లా విద్యాశాఖాధికారి

శిక్షణ బాగుంది..


ఉన్నతి శిక్షణ మెరుగైన బోధనకు దోహదపడుతుంది. పరీక్షల నిర్వహణ, పాఠ్యాంశాల ప్రణాళిక, పిల్లల స్థాయి ఆధారంగా వర్గీకరణ, బోధనపై అవగాహన వచ్చింది. విద్యార్థుల సామర్థ్యాలు పెరిగే బోధించేందుకు ఈ శిక్షణ ఉపయోగపడుతుంది.

– డి.నాగమణి, హిందీ ఉపాధ్యాయురాలు, తనికెళ్ల

ఉన్నతితో ఉపయోగం...


ఇన్నాళ్లు ఎవరి విధానంలో వారు బోధించేవారు. కానీ విద్యార్థుల స్థాయి ఆధారంగా బోధించడం, సామర్థ్యాలను పెంచేలా బోధించే మార్గం తెలిసింది. హెచ్‌ఎం మొదలు అధికారులు పర్యవేక్షించనుండడంతో మంచి ఫలితాలు వస్తాయి.

– ఎం.భాస్కర్‌రావు, ఇంగ్లిష్ ఉపాధ్యాయుడు, పల్లిపాడు

విద్యార్థుల స్థాయిని పెంచేలా బోధన


విద్యార్థుల స్థాయిని గుర్తించి వారిలో సామర్థ్యాలను పెంచేలా బోధించేందుకు ఉన్నతి, లక్ష్య కార్యక్రమాలు దోహదపడతాయి. పరీక్షల ద్వారా సామర్థ్యాలను అంచనా వేస్తూ పిల్లలను తీర్చిదిద్దేలా బోధించడం సులువవుతుంది.

– హెచ్.శైలేంద్ర, జెడ్పీహెచ్‌ఎస్, గోళ్లపాడు

వైద్యం, రవాణా సౌకర్యాలు లేక గిరిజనుల ఇక్కట్లు


సమావేశంలో మాట్లాడుతున్న మోహనరావు, పక్కన రవీందర్‌నాయక్ తదితరులు

ఖమ్మం మామిళ్లగూడెం: గిరిజన ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైన వైద్యం అందక, సరైన రవాణా సౌకర్యాలు లేక గిరిజన, ఆదివాసీలు ఇబ్బంది పడుతున్నారని మాజీ ఎంపీలు గరికపాటి మోహన్‌రావు, రవీంద్రనాయక్ ఆందోళన వ్యక్తం చేశారు. ఖమ్మంలో ఆదివారం వారు విలేకరులతో మాట్లాడారు. పలు గిరిజన ప్రాంతాల్లో ప్రజలకు సమయానికి వైద్యం అందక ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. ఈ విషయమై కేంద్రానికి నివేదించామని, రాష్ట్రప్రభుత్వం కూడా దృష్టి సారించాలని కోరారు. ఇటీవల ఖమ్మంలో జరిగిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా సభ అనంతరం గిరిజనులు, ఆదివాసీలు బీజేపీ వైపు చూస్తున్నారని, ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఐదు ఎస్టీ నియోజకవర్గాలను వచ్చే ఎన్నికల్లో కైవసం చేసుకుంటామనే నమ్మకం ఉందని తెలిపారు. తొలుత ఖమ్మం లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో వారు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, నాయకులు సురేష్‌రెడ్డి, కె.రవీందర్, నున్నా రవికుమార్, శ్యాంరాథోడ్, ఆర్.నాగేశ్వరావు, నెల్లూరి కోటేశ్వరావు, విజయరెడ్డి, చావా కిరణ్, ఎం.నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

బాలసాహిత్యంతో విద్య, విలువలు


పుస్తకాలను ఆవిష్కరిస్తున్న శ్రీనివాసరావు, తదితరులు

సత్తుపల్లిటౌన్: నేటితరం విద్యార్థులు సామాజిక మాధ్యమాలలోని కాలుష్యాన్ని మనసుల్లో నింపుకుంటున్నారని.. వీటిని తొలగించి విద్య, విలువలు పెంపొందించేలా బాలసాహిత్యాన్ని రాయాల్సిన బాధ్యత కవులు, రచయితలపై ఉందని కవి, విద్యావేత్త, జాషువా సాహిత్య వేదిక అధ్యక్షుడు మువ్వా శ్రీనివాసరావు అన్నారు. సత్తుపల్లిలోని కళాభారతిలో సృజన సాహితీ సమాఖ్య ఆధ్వర్యాన రంగపురి కృష్ణార్జున్ రచించిన బాల సాహిత్యం, చరితార్థ శతకం, రజోత్సవ కథల పుస్తకాలను శ్రీనివాసరావు ఆవిష్కరించారు. అనంతరం బి.మధుసూదన్‌రాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో ఉపాధ్యాయులు పాఠాలు బోధిస్తే సరిపోయేదని, కానీ ఇప్పుడు విలువలతో కూడిన పాఠాలు బోధించాల్సిన అవసరముందని చెప్పారు. ఈకార్యక్రమంలో కృష్ణార్జున్–సుజాత దంపతులతో దమ్మపేట ఎంఈఓ లక్ష్మి, కన్నెగంటి వెంకటయ్య, జగపతి, పద్మావతి, వురిమళ్ల సునంద, కన్నెగంటి వెంకటయ్య, కోంద్రు బ్రహ్మం, రంగపురి వెంకటేశ్వరరావు, జి.రామకృష్ణ, పసుపులేటి నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, కల్లాణశర్మ, పిల్లి మల్లికార్జున్‌రావు పాల్గొన్నారు.

తుమ్మల పాలేరు నుంచి గెలవాలని పూజలు


పూజలు చేస్తున్న తుమ్మల అభిమానులు

ఖమ్మంరూరల్: తుమ్మల నాగేశ్వరరావు పాలేరు నియోజకవర్గం నుంచి గెలవాలని కోరుతూ ఆయన అభిమానులు మండలంలోని రెడ్డిపల్లిలోని మారెమ్మతల్లి ఆలయంలో ఆదివారం పూజలు చేశారు. 108 కొబ్బరికాయలు కొట్టారు. కార్యక్రమంలో మద్ది మల్లారెడ్డి, బండి జగదీశ్, తేజావత్ పంతులునాయక్, అంబటి సుబ్బారావు, తమ్మినేని నవీన్, గుత్త నరేశ్, బోజెడ్ల వెంకటయ్య, సావిడి కరుణాకర్, వెంకన్న, భాస్కర్, తరుణ్, ఉదయ్, నరేశ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఇంటి రుణం పేరిట సైబర్ నేరగాళ్ల వల

పెనుబల్లి: ఓ యువకుడి అవసరాన్ని ఆసరాగా చేసుకున్న సైబర్ నేరగాళ్లు రూ.లక్షకు పైగా నగదు కాజేశారు. బాధితుడు పోలీసులకు అందజేసిన ఫిర్యాదులోని వివరాలిలా ఉన్నాయి. పెనుబల్లి మండలం గట్టుగూడెంకు చెందిన కొర్సా అశోక్ తన సెల్‌కు వచ్చిన మెసేజ్ ఆధారంగా ఇండియా బుల్స్ యాప్‌ను డౌన్ లోడ్ చేసుకుని గృహరుణంగా రూ.8 లక్షలు కావాలని దరఖాస్తు చేసుకున్నాడు. ఆతర్వాత అశోక్‌కు గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్ చేసి రుణం మంజూరు కోసం తొలుత రూ.4,700 చెల్లించాలనడంతో ఆయన ఫోన్‌పే ద్వారా నగదు బదిలీ చేశారు. అనంతరం మొదటి ఈఎంఐ రూ.36వేలు, ఇతర ఖర్చుల పేరిట రూ.1,10,000 వసూలు చేశారు. మళ్లీ శనివారం ఫోన్ చేసి ఇంకో రూ.7,500 చెల్లిస్తే రూ. 8లక్షల రుణంతో పాటు అదనంగా లక్షన్నర కలిపి రూ.9.50 లక్షలు అకౌంట్‌కు పంపుతామని చెప్పడంతో అనుమానించిన ఆయన మోసపోయినట్లుగా గుర్తించాడు. ఘటనపై ఆదివారం ఆన్‌లైన్ ద్వారా సైబర్ క్రైం పోలీసులతో పాటు వీఎం బంజర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు కొర్సా అశోక్ తెలిపాడు.

ప్రేమ పెళ్లి... ఆపై వరకట్న వేధింపులు

ఆత్మహత్య చేసుకున్న వివాహిత

రఘునాథపాలెం: ఎనిమిదేళ్ల క్రితం ప్రేమ పెళ్లి చేసుకున్నారు. ఆతర్వాత నుండి భర్తతో పాటు అత్తమామలు వరకట్నం కోసం వేధిస్తుండడంతో పురుగుల మందు తాగిన వివాహిత చికిత్స పొందుతూ మృతి చెందగా రఘునాథపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. ఖమ్మం రూరల్ మండలం జలగంనగర్‌కు చెందిన చంద్రిక(31), రఘునాథపాలెంకు చెందిన ఎ.ప్రవీణ్‌కుమార్ 2015 ఏడాదిలో ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరికి ఐదేళ్ల కుమారుడు ఉండగా, గత ఏడాది కాలంగా భర్తతో పాటు అత్తామామలు లక్ష్మి, రమేష్ ఆమెను అనుమానిస్తూ అదనపు కట్నం తీసుకురావాలని వేధిస్తున్నారు. దీంతో ఆమె ఈనెల 2న ఇంట్లో ఎలుకల మందు తినగా, ఖమ్మం ఆస్పత్రికి, అక్కడి నుండి హైదరాబాద్ తరలించారు. అయితే, పరిస్థితి విషమించడంతో శనివారం ఖమ్మం తీసుకురాగా, చంద్రిక మృతి చెందింది. ఘటనపై ఆమె తండ్రి కొండల్‌రావు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు.

ఆయిల్‌పాం రైతులకు సౌకర్యాల కల్పనపై దృష్టి

- ఆయిల్‌ఫెడ్ చైర్మన్ రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరా
- ఫ్యాక్టరీల్లో పలు భవనాల ప్రారంభోత్సవం


అశ్వారావుపేట రూరల్ : ఆయిల్‌ఫెడ్ విశ్రాంతి భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే మెచ్చా, చైర్మన్ రామకృష్ణారెడ్డి

అశ్వారావుపేటరూరల్: ఆయిల్‌పాం సాగు విస్తరణకు కృషి చేస్తూనే ఫ్యాక్టరీల్లో రైతులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంపై రాష్ట్రప్రభుత్వం దృష్టి సారించిందని అశ్వారావుపేట ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు తెలిపారు. అశ్వారావుపేట మండలం నారంవారిగూడెంలోని ఆయిల్‌ఫెడ్ నర్సరీ ఆవరణలో రూ.1.38కోట్లతో నిర్మించిన విశ్రాంతి భవనం, అశ్వారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీ వద్ద రైతుల కోసం రూ.8 లక్షల వ్యయంతో నిర్మించిన ఫార్మర్ షెడ్‌ను ఆయన ఆయిల్‌ఫెడ్ చైర్మన్ కంచర్ల రామకృష్ణారెడ్డి, ఆయిల్‌ఫెడ్ ఎండీ సురేందర్‌రెడ్డితో కలిసి ఆదివారం ప్రారంభించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంట సాగు విస్తరణతోపాటు, గెలల క్రషింగ్ కోసం నూతనంగా ఫ్యాక్టరీలను నిర్మిస్తున్నామని అన్నారు. దీర్ఘకాలిక ఆదాయాన్ని అందించే ఆయిల్‌పాం సాగును ప్రోత్సహించేందుకు సీఎం కేసీఆర్ ప్రణాళికలు రూపొందించారని తెలిపారు.

అప్పారావుపేటలో...

దమ్మపేట: దమ్మపేట మండలం అప్పారావుపేటలో ని పామాయిల్ ఫ్యాక్టరీలో వ్యర్థాలను శుద్ధి చేసే(ఎంఈఈ) ప్లాంట్, రైతుల విశ్రాంతి భవనాన్ని ఆది వారం తెలంగాణ ఆయిల్‌ఫెడ్ చైర్మన్ కంచర్ల రామకృష్ణారెడ్డి, అశ్వారావుపేట ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆయిల్‌ఫామ్ సాగును పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్న నేపథ్యాన ప్లాంట్ విస్తరిస్తున్నట్లు తెలిపారు. తొలుత మండల కేంద్రంలోని శ్రీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి ఆలయంలో రూ.30 లక్షల వ్యయంతో కల్యాణ మండప నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈకార్యక్రమాల్లో ఆయిల్‌ఫెడ్ జనరల్ మేనేజర్ సుధాకర్‌రెడ్డి, మేనేజర్(ప్రాజెక్ట్స్) శ్రీకాంత్‌రెడ్డి, మేనేజర్లు బాలకృష్ణ, కల్యాణ్, అబ్దుల్ జిన్నా, రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షుడు రావు జోగేశ్వరరావు, జెడ్పీటీసీలు పైడి వెంకటేశ్వరరావు, వరలక్ష్మి, ఎంపీపీ శ్రీరామ్మూర్తి, జిల్లా ఉద్యాన శాఖ అధికారి మరియన్నతో పాటు చిట్టూరి ఫణీంద్ర, బీఆర్‌ఎస్ నాయకులు బండి పుల్లారావు, మందపాటి మోహన్‌రెడ్డి, బిర్రం వెంకటేశ్వరరావు, జేకేవీ.రమణారావు, ప్రకాశ్‌రావు, ఎస్.ప్రసాద్, కాసాని చంద్రమోహన్, దారా యుగేందర్, దారా మల్లికార్జునరావు, దొడ్డాకుల రాజేశ్వరరావు పాల్గొన్నారు.

గల్లంతైన రైతు మృతదేహం లభ్యం

ముదిగొండ: మండలంలోని సీతారాంపురానికి చెందిన వృద్ధుడు వట్టే చిన్న నాగయ్య(80) శుక్రవారం కట్టకూరు సమీపాన సాగర్ కాల్వలో ప్రమాదవశాత్తు గల్లంతు కాగా, ఆయన మృతదేహం ఆదివారం లభ్యమైంది. గత రెండు రోజులుగా స్థానికులు సాగర్ కాల్వ పొడవునా గాలిస్తుండగా, యడవల్లి సమీపంలోని సాగర్ కాల్వలో మృతదేహాన్ని గుర్తించారు. ఆయన కుమారుడు వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ముదిగొండ ఎస్‌ఐ నరేష్ ఈ సందర్భంగా తెలిపారు.


డీజిల్ కల్తీ చేశారని ఆందోళన



డీజిల్ బాటిల్‌లో పైకి తేలిన నీళ్లు

సత్తుపల్లిటౌన్: డీజిల్‌లో నీళ్లు కలిశాయని ఆరోపిస్తూ సత్తుపల్లిలో వాహనదారులు ఆదివారం ఆందోళనకు దిగారు. పట్టణంలోని హనుమాన్‌నగర్ వద్ద కోటమ హెచ్‌పీ పెట్రోల్‌బంక్‌లో పలువురు వాహనదారులు కార్లు, లారీలకు డీజిల్ కొట్టించారు. ఇందులో పలువురి వాహనాలు కొంత దూరం వెళ్లాక ఆగిపోవడంతో తిరిగి బంక్‌కు వచ్చి బాటిళ్లలోకి డీజిల్ పోయిస్తే నీళ్లు కనిపించాయి. దీంతో ఆందోళనకు దిగగా, పోలీసులు చేరుకుని సర్దిచెప్పి రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఈమేరకు వారు సోమవారం బంక్‌లో తనిఖీ చేస్తామని చెప్పడంతో ఆందోళన విరమించారు.

ఖమ్మం వ్యాపారి అమెరికాలో మృతి


నాగేశ్వరరావు(ఫైల్)

ఖమ్మం సహకారనగర్: ఖమ్మం 25వ డివిజన్ రిక్కాబజార్‌కు చెందిన ప్రముఖ వ్యాపారి, సాయిబాబా ట్రస్ట్ సభ్యుడు, కాంగ్రెస్ సానుభూతిపరుడైన పసుపర్తి నాగేశ్వరరావు(65) ఈనెల 4వ తేదీన అమెరికాలో మృతి చెందారు. దీంతో ఆయన మృతదేహాన్ని ఆదివారం ఖమ్మంకు తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. ఆయన ఇద్దరు కుమారుల్లో ఒకరు హైదరాబాద్, ఇంకొకరు అమెరికాలో నివసిస్తున్నారు. కాగా, ఆదివారం ఖమ్మంకు నాగేశ్వరరావు మృతహాన్ని తీసుకురాగా కాంగ్రెస్ నాయకులు వడ్డెబోయిన నర్సింహరావు, దాసరి పూర్ణ, రాధాకృష్ణ, సోమనాథం, జంగిలి నాగేశ్వరరావు, కృష్ణమూర్తి తదితరులు నివాళులర్పించి కుటుంబీకులను పరామర్శించారు.

మహిళపై కోతుల మూకుమ్మడి దాడి

నేలకొండపల్లి: ఓ మహిళపై కోతులు మూకుమ్మడిగా దాడి చేయటంతో తీవ్రంగా గాయపడింది. మండలంలోని మోటాపురానికి చెందిన చావా ధనమ్మ ఇంటి వద్ద ఉండగా ఆదివారం కోతుల ఒక్కసారిగా దాడి చేశాయి. ఈ ఘటనలో ఆమె తలకు తీవ్రగాయాలు కాగా స్థానిక ఆస్పత్రిలో చికిత్స చేయించారు.

పరస్పర దాడుల్లో ఒకరికి గాయాలు

కారేపల్లి: భూవివాదం నేపథ్యాన పాతకక్ష్యలను దృష్టిలో పెట్టుకుని ఇరువర్గాలు ఘర్షణకు దిగగా ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. మండలంలోనిసూర్యతండాకు బంధువుల నడుమ భూమి విషయమై కొన్నేళ్లుగా వివాదం జరుగుతోంది. ఈనేపథ్యాన ఆదివారం రెండు వర్గాలు ఇనుపరాడ్లతో దాడులు చేసుకోవటంతో ఒకరి తలకు తీవ్ర గాయమైంది. దీంతో ఆయనను ఖమ్మం తరలించారు. కాగా, ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

ముగ్గురు మావోయిస్టుల లొంగుబాటు

దుమ్ముగూడెం: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లాలో ఆదివారం ముగ్గురు మావోయిస్టులు లొంగిపోయారు. వారిలో ఓ మహిళా మావోయిస్టు కూడా ఉంది. లొంగిపోయిన వారిలో న్యూ మార్నింగ్, న్యూ బిగినింగ్, బెటాలియన్ సభ్యురాలు కమ్లీ అలియాస్ కమ్లా, ఈస్ట్ బెటాలియన్ కంపెనీ సభ్యుడు దేవా, డీఏకేఎంఎస్ సభ్యుడు సన్ను ఉన్నారు. వారిపై రూ.8 లక్షల రివార్డు ఉందని, పునరావాసంలో భాగంగా వారికి ప్రోత్సాహకాలు అందించినట్లు సుక్మా ఎస్పీ కిరణ్ చవాన్, కమాండింగ్ ఆఫీసర్ సురేష్ సింగ్ పాయల్ తెలిపారు.